క్లుప్తంగా

వల్లూరు శివాలయంలో రుద్రాభిషేకం



వల్లూరులో స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: వల్లూరులోని పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు పుణ్యస్నానమాచరించి స్వామికి పూజలు చేశారు. భక్తులకు స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

వైభవంగా అయ్యప్పల పేటతుళ్లి



వెదురుపాకలో అయ్యప్ప స్వామి రథోత్సవంలో అయ్యప్ప మాలధారులు

రాయవరం: వెదురుపాక గ్రామంలో అయ్యప్ప స్వాముల పేటతుళ్లి వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కడియాల వెంకటరమణ గురుస్వామి నేతృత్వంలో పేటతుళ్లి, అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై ఉంచి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం మాలధారణ చేసిన స్వాములంతా అయ్యప్ప గీతాలకు అనుగుణంగా పేటతుళ్లి ఆడారు. స్వాములంతా రంగులు పూసుకుని, విచిత్ర వేషధారణలతో చేసిన పేటతుళ్లి గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. అయ్యప్ప స్వామి రథోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించి, స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన 35 మంది అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌కు వీడ్కోలు సత్కారం



డ్రైవర్ సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ రంగారావు

మండపేట: మున్సిపాలిటీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా 36 ఏళ్లపాటు అంకితభావంతో తొత్తరమూడి సత్యనారాయణ చేసిన సేవలు గుర్తుండిపోతాయని చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కొనియాడారు. శనివారం పదవీ విరమణ చేసిన సత్యనారాయణను కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై సత్యనారాయణ దంపతులను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. దుర్గారాణి, కమిషనర్ రంగారావు తమ ప్రసంగాల్లో సత్యనారాయణ సేవలను అభినందించారు. చైర్‌పర్సన్ చేతుల మీదుగా పీఎఫ్ చెక్కును సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె. శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మున్సిపల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత సాధ్యం



పిరమిడ్ మాస్టర్లను సత్కరిస్తున్న ఫణికృష్ణారెడ్డి తదితరులు

రాయవరం: ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయించాలని, ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ మాస్టర్లు శ్రీరవి, శ్రీకుమారి సూచించారు. రాయవరం సత్యసాయి మందిరంలో 17వ ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, సత్యసాయి ధ్యాన మందిరం నిర్వాహకుడు కాశీవిశ్వనాథం చేతుల మీదుగా నిర్వహించారు. మానసికంగా ప్రశాంతత కలిగినపుడే ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందన్నారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ధ్యానం ప్రతి ఒక్కరికీ అత్యవసరమన్నారు. అనంతరం ధ్యాన శిక్షణ ఇచ్చిన శ్రీరవి, శ్రీకుమారిలను ఫణికృష్ణారెడ్డి, కాశీవిశ్వనాథం చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో కొవ్వూరి వెంకటరెడ్డి, సునీత, వెంకటేశ్వరరావు, రాయవరం, సోమేశ్వరం, పులుగుర్త, అర్తమూరు తదితర గ్రామాలకు చెందిన పిరమిడ్ ఫాలోవర్స్ పాల్గొన్నారు.

వరుణా.. తగునా..!?

- రైతులపై తుపాను గండం
- రెండు రోజులుగా భారీ వర్షం
- రోడ్ల మీదనే ధాన్యం రాశులు



ధాన్యం రాశులను బరకాలతో కప్పుతున్న రైతులు, కూలీలు



గొల్లపాలెంలో రోడ్డు పక్కనే బరకాలతో కప్పిన ధాన్యం రాశులు

రామచంద్రపురం: ఫెంగల్ తుపాను ప్రభావం రైతులపై పడింది. తొలకరి పంట చివరి దశలో ఏర్పడ్డ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు ధాన్యం రాశులు రోడ్లపై, పొలాల్లోను ఉండిపోయాయి. దాదాపుగా 80 శాతం మాసూళ్లు పూర్తి చేసుకున్నా.. కొనుగోళ్లు మాత్రం జరగకపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యం అమ్ముడవుతుందా, రేటు ఎలా ఉంటుందనే ఆందోళనలో రైతులు గగ్గోలు పెడుతున్నారు. తొలకరిలో రామచంద్రపురం నియోజకవర్గంలో 54 వేల ఎకరాల్లోను, మండపేట నియోజకవర్గంలో 58 వేల ఎకరాల్లోను వరి సాగు చేస్తుంటారు. ఈసారి గతంలో కంటే అక్టోబర్, నవంబర్ నెలల్లో తుపాన్లు అంతగా ప్రభావం చూపలేదు. కానీ మాసూళ్లు ఆలస్యం కావటంతో రైతులు నవంబర్ చివరల్లో ఏర్పడ్డ తుపాను ప్రభావానికి గురికాక తప్పలేదు.

కొనుగోళ్లలో జాప్యంతో..

ప్రస్తుతం మండపేట నియోజకవర్గంలో 90శాతం, రామచంద్రపురం నియోకవర్గంలో 78శాతం వరి మాసూళ్లు పూర్తయ్యాయి. దాదాపుగా మాసూళ్ల మధ్యలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను సాంకేతిక కారణాలు చూపిస్తూ నిలిపివేసింది. దీంతో రైతులు పొలాల్లోను, రోడ్లపై ధాన్యం రాశులుగా పోసి ఉంచారు. ఇక్కడ పెద్ద ప్రభావం చూపదని భావించిన ఫెంగల్ తుపాను కారణంగా గత రెండు రోజులుగా విస్తారంగానే వర్షం కురిసింది. దీంతో మాసూళ్లతో పాటు, ధాన్యం కొనుగోళ్లూ నిలిచిపోయాయి. ఇప్పటి వరకు రామచంద్రపురం నియోజకవర్గంలో 60 శాతం, మండపేట నియోజకవర్గంలో 80 శాతం కొనుగోళ్లు జరిగినట్లు సమాచారం.

ఆందోళనలో రైతులు

ఇప్పటికే గిట్టుబాటు ధర రావటం లేదని ఆందోళన చెందుతున్న రైతులకు ఫెంగల్ తుపాను రూపంలో పిడుగు పడింది. తుపాను కారణంగా రైతులు హడావిడిగా పోగు చేసుకుని కళ్లాల్లోనే బరకాలతో తడవకుండా ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నాలు చేసుకున్నారు. మొదటి రెండు రోజులు వర్షం కురవకపోయినా, తుపాను తీరం దాటిన తరువాత మాత్రం రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రాశులుగా పోసిన ధాన్యం తడిసి పోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత వారం రోజులుగా ప్రభుత్వం సాంకేతిక కారణాలు చూపుతూ ధాన్యం కొనుగోళ్లను నిలిపివేసిందని రైతులు అంటున్నారు. దీని వల్లే కొనుగోళ్లు నిలిచిపోయి కుప్పలుగా పోసుకోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనాలి



పొలాల్లో రాశులు పోసిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. తడిసిన ధాన్యానికి మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతుకు ఊరట లభిస్తుంది. అధికారులు తడిసిన ధాన్యాన్ని అంచనా వేసి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– నల్లమిల్లి చంద్రరెడ్డి, రైతు, గొల్లపాలెం

మద్దతు ధర కల్పించాలి



ప్రస్తుతం తుపాను ప్రభావంతో రెండు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాల ప్రభావంతో మాసూళ్లు చేసి ఉంచిన ధాన్యం రాశులు తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యానికి కూడా తేమ శాతంతో పని లేకుండా మద్దతు ధర ఇప్పించాలి.

– రెడ్డి జయరాజు, సుందరపల్లి, కె.గంగవరం మండలం

ప్రభుత్వానికి నివేదిస్తాం



దాదాపుగా తొలకరి మాసూళ్లు పూర్తి కావచ్చిన సమయంతో ఫెంగల్ తుపాను ప్రభావం నియోజకవర్గంలో ఏర్పడింది. తుపాను హెచ్చరికల కారణంగా ముందుగా రైతులు జాగ్రత్తలు తీసుకోవటంతో నష్టం తక్కువగానే ఉంది. వర్షం ఎక్కువగా కురిసి రాశులు కింద తడవకుండా ఎక్కువగా గడ్డి బకరాలు వంటివి రైతులు ఏర్పాటు చేసుకున్నారు. వర్షం కారణంగా ధాన్యం తడిస్తే, వాటిని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తాం.

– సత్యప్రసాద్, ఏఓ, రామచంద్రపురం

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం: తుపాను ప్రభావంతో వర్షాలు కురవడం వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ బలుసు రవి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మరో మూడు రోజుల పాటు అధిక వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యాన్ని రక్షించుకోవాలన్నారు. రైతులకు ఎవరికైనా టార్పాలిన్లు అవసరమైతే ఆయా గ్రామాల్లోని సొసైటీల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు సరఫరా చేయాలని, తేమ శాతంతో ఇబ్బందులుంటే వ్యవసాయ సిబ్బంది పరిష్కరించి అన్‌లోడ్ చేయిస్తారన్నారు.

యూటీఎఫ్‌కు కంప్యూటర్ బహూకరణ



యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావుకు కంప్యూటర్‌ను అందజేస్తున్న రమాదేవి

రాయవరం: యూటీఎఫ్ రాయవరం మండల శాఖకు ఉపాధ్యాయురాలు కంప్యూటర్ బహూకరించారు. ఈ విషయాన్ని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లమిల్లి భాస్కరరెడ్డి, గొడితి మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కంచి రమాదేవి తన భర్త చింతపల్లి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.20 వేల విలువైన కంప్యూటర్‌ను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మండల శాఖకు అందజేశారన్నారు.

సందడిగా కాపు కార్తిక వన సమారాధన



వన సమారాధనలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



హాజరైన కాపు సామాజిక వర్గీయులు

మండపేట: కాపు కార్తిక వన సమారాధన పట్టణంలో ఆదివారం సందడిగా జరిగింది. ఏడిద రోడ్డులోని జొన్నల వెంకటేశ్వరరావు గోదాముల వద్ద శ్రీకృష్ణదేవరాయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకకు పట్టణం నుంచే గాకుండా, నియోజకవర్గంలోని 43 గ్రామాల నుంచి కాపులు కుటుంబ సమేతంగా తరలి వచ్చారు. పట్టణ కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వన సమారాధనకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని కాపు ప్రముఖులు నల్లా విష్ణు, ఆకుల రామకృష్ణ, మర్రెడ్డి శ్రీనివాస్, రేవు శ్రీను, నల్లా చంద్రరావు కుమారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, మండపేట మున్సిపల్ కాపు కౌన్సిలర్లు అతిథులుగా హాజరయ్యారు. కాపు సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా సారథ్యంలో సంఘ నాయకులు, నిర్వహణ కమిటీ సభ్యులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. తొలుత ఉసిరి చెట్టు కింద పూజలు నిర్వహించి శ్రీమహావిష్ణువుకి 20 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కాపులందరూ సంఘటితంగా ఉంటూ ఒకరికొకరు తోడ్పాటు అందించుకోవాలన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా కాపులకు ఏ సమస్య వచ్చినా తానున్నానన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. కాపు ఉద్యమ నాయకుడు ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ కాపు యువత అందరూ ఉన్నత విద్య అభ్యసించాలన్నారు.ఎన్నో ఏళ్లుగా కాపుల అభ్యున్నతి కోసం ఉద్యమం సాగిస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం అతిథులను, కాపు కౌన్సిలర్లను తోట త్రిమూర్తుల చేతుల మీదుగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సంఘాధ్యక్షుడు సాయిబాబా నేతృత్వంలో కాపు నాయకులు ఎమ్మెల్సీ తోటను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు.

స్తంభించిన జన జీవనం



మంజేరులోని పొలంలో నీట నానుతున్న ధాన్యం



గొల్లపాలెంలో ఇంటిపై కూలిన కొబ్బరి చెట్టు

కాజులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా మోస్తరు గాలులు, చెదురు మదురు వర్షం కురిసినప్పటికీ, ఆదివారం తెల్లవారుజాము నుంచి బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. పలు గ్రామాలలో చెట్లు విరిగిపడగా, కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచి గ్రామాలలో అంధకారం నెలకొంది. స్థానికులు స్వచ్ఛందంగా రోడ్లపై కూలిన చెట్లను తొలగించారు. తుపాను ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతాంగానికి తీవ్ర నష్టం

అన్నదాతలకు తీరని నష్టం

కలుగజేశాయి. గ్రామాలలో అధిక శాతం రైతులు పంట కోతలు కోసినప్పటికీ, కొందరు వరి కుప్పలుగానూ, కొందరు మాసూళ్లు చేసిన ధాన్యాన్ని కళ్లాలపై, రోడ్ల వెంబడి ఆరబెడుతున్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షం వరి కుప్పలకు తీవ్రనష్టం కలగజేసింది. కళ్లాలపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. ధాన్యం కుప్పలను మూసి ఉంచేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి



వన సమారాధనలో నాయకులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రామచంద్రపురం: జీవితాలను మార్చేది చదువు మాత్రమేనని అందరూ బాగా చదువుకుని కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణ కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అరిగెల వీరరాఘవులు కృష్ణవేణి దంపతులు, అరిగెల నాగేశ్వరరావు దంపతులు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు.

పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు నారపరెడ్డి బలరాం, ఇతర కార్యవర్గ సభ్యులు వన సమారాధన పర్యవేక్షించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సభకు అధ్యక్షత వహించారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగాలు అందరికీ ఇవ్వలేని పరిస్థితులున్నాయన్నారు. ఎవరికి వారు కష్టపడే తత్వంతో, ఎంచుకున్న రంగంలో కృషి చేస్తే అభివృద్ధి సాధిస్తారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ పలువురు కౌన్సిలర్లు, రాజకీయ, అధికార ప్రముఖులు పాల్గొన్నారు. నాట్య ఆచారిని సిరిగినీడి మాధవి దేవి బృందం, నాట్యాచార్యులు చెవ్వూరు తుల సీరామ్ బృందం, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అవగాహనతో ఎయిడ్స్‌పై పోరాడదాం



ద్రాక్షారామలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



అంగరలో అవగాహన ర్యాలీలో ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: ప్రతి ఒక్కరూ అవగాహనతో మహమ్మారి ఎయిడ్స్ వ్యాధిపై పోరాడాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని ఆరోగ్య సమస్యగానే కాకుండా సామాజిక సమస్యగా చూడాలన్నారు. వ్యాధిగ్రస్తులు పట్ల మానవత్వంతో వ్యవహరించాలని, ఆధునిక చికిత్సా పద్ధతులతో వ్యాధిగ్రస్తులు సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవనం గడిపే వీలుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి, స్టాఫ్ నర్సు జె.బంగారు పాప, ఎంఎల్‌హెచ్‌పీ రమాదేవి, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేయాలి

కాజులూరు: ప్రపంచ దేశాల్లో మానవాళి మనుగడకు అవరోధంగా మారిన హెచ్ఐవీ మహమ్మారిని నియంత్రించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని తాళ్లరేవుకు చెందిన బీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధిని అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో సంఘ సభ్యులు అవగాహన సదస్సులు నిర్వహించారు. గొల్లపాలెంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, హైచ్ఐవీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయా కార్యక్రమాలలో సంఘ సభ్యులు జి.రామయ్యశెట్టి, అర్జునరావు, కనకాంబరం, శివశంకర్, చంద్రకళ, అనితకుమారి, లోవకుమారి, నూకలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ, హెచ్ఐవీ అంటువ్యాధి కాదని చెప్పారు. హెచ్ఐవీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులు పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె నోటీసు



మునిసిపల్ కమిషనర్ రంగారావుకు సమ్మె నోటీసు ఇస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

మండపేట: తమ వేతనాలు పెంచాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9 నుంచి సమ్మెకు దిగుతామని వారు ప్రకటించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ రంగారావుకు సమ్మె నోటీసు ఇచ్చినట్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆదివారం మీడియాకు తెలిపారు.

ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాలపర్తి సుబ్బారాజు, తలాటి వెంకన్న, కప్పల సురేంద్ర, టేకి వెంకన్న, జి.అశోక్, యాదాల తాతారావు, పాలపర్తి సురేష్ కన్నా విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తాము చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం తమకు నెలకు రూ.15 వేల జీతం మాత్రమే వస్తుంటే, అందులో పీఎఫ్ కటింగ్స్ పోగా, చేతికి రూ.13 వేలు మాత్రమే అందుతోందన్నారు. ఈ స్వల్ప మొత్తంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని వాపోయారు. టెక్నికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.29200, నాన్ టెక్నికల్ అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.24,500 వేతనంగా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు.

ఇతరులతో సోదరభావంతో మెలగాలి

శ్రీ సచ్చిదానంద దివ్యజ్ఞాన సమాజంలో డిప్లొమా కార్డుల ప్రదానోత్సవం



దివ్యజ్ఞాన సమాజంలో డిప్లొమా కార్డులు అందుకున్న నూతన సభ్యులు

మండపేట: ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల సోదర భావంతో మెలగుతూ సమాజంలో విలువల పెంపునకు పాటు పడాలని తెలుగు ఫెడరేషన్ ప్రెసిడెంట్ కేఎస్ రామచంద్రరావు, రాజమహేంద్రవరం దివ్యజ్ఞాన సమాజం కార్యదర్శి కేవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తాపేశ్వరంలోని శ్రీ సచ్చిదానంద దివ్యజ్ఞాన సమాజంలో ఆదివారం డిప్లొమా (సభ్యత్వాలు)ల ప్రదానోత్సవం జరిగింది. దివ్యజ్ఞాన సమాజం సొసైటీ కార్యదర్శి రిమ్మలపూడి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామచంద్రరావు, ప్రభాకర్ బాలాజీ, గోపాలకృష్ణ హాజరై మాట్లాడారు. సమాజంలో విలువలు పెంపొందించేందుకు సచ్చిదానంద దివ్యజ్ఞాన సమాజం కృషి చేస్తుందన్నారు.

అనంతరం దివ్యజ్ఞాన సమాజంలో చేరేందుకు డిప్లొమా కార్డులు ప్రదానం చేశారు. తాడేపల్లిగూడెం సమాజం సభ్యులు పాండురంగారావు, నరసింహారావు చేతుల మీదుగా సమాజ పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యజ్ఞాన సమాజం సత్యాన్ని బోధిస్తుందన్నారు. తాపేశ్వరంలో 100 మందికి పైగా సభ్యత్వాలు తీసుకున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో నూతన భవన నిర్మాణానికి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నూనె వీర్రాజు చౌదరి, వైస్ ప్రెసిడెంట్ బోడా చిరంజీవిరావు, కోశాధికారి మాసిన భాస్కరరావు సభ్యులు బోడా బాపిరాజు, వల్లూరి సుబ్బారావు, గున్నపునీడి సూర్య ప్రకాశ రావు, రిమ్మలపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407